సాక్షి నంద్యాల
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



వెండిరథంపై ఆది దంపతులు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో సోమవారం స్వామి అమ్మవార్లను వెండిరథంపై అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన చేశారు.



.. ఊరూరా భక్తిపారవశ్యం
ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉరుకుంద నుంచి కందుకూరు సమీపంలోని తుంగభద్ర నది వరకు ఉత్సవం సాగింది. 8లో▸



కన్నీళ్లు తుడుస్తూ..
పేదలకు వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తోంది. రైస్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గతేడాది 1,431 మంది ఈ పథకం కింద లబ్ధిపొందారు. 8లో▸

న్యూస్‌రీల్

మిర్చి గరిష్ట ధర క్వింటా రూ.23,200

నంద్యాల(సెంట్రల్): నంద్యాల మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం రైతులు తెచ్చిన స్థానిక శీతల గోదాముల్లో నిల్వ చేసిన సూపర్‌-10, తేజ, సూపర్‌-5, బాడిగ రకం నమూనాలను ధ్రువీకృత వ్యాపారస్తులు పరిశీలించి బేరాలు జరిపారు. సూపర్‌-10 రకం జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.23,200, కనిష్ట ధర రూ.15,500, మోడల్ ధర రూ.22,800 పలికింది. ఇదే రకం తాలు కాయ క్వింటా గరిష్ట ధర రూ.11,800, కనిష్ట ధర రూ.11,000, మోడల్ ధర రూ.11,500గా నమోదైంది. నంద్యాల మిర్చి మార్కెట్ అందుబాటులోకి రావడంతో రైతులు గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇక్కడే విక్రయించుకోవ్వని ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన సూచించారు.

అన్నదాన పథకానికి రూ. 3 లక్షల విరాళాలు



ఇంకొల్లుకు చెందిన దాతలకు బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం పలువురు దాతలు రూ. 3 లక్షల విరాళాలు అందజేశారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన రమేష్ రూ.2,00,002, ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు చెందిన సుకన్య రూ.1,00,005 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయాధికారులకు అందజేయగా వారు దాతలకు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు, జ్ఞాపికను అందజేశారు.

15న వైద్య కళాశాల ప్రారంభోత్సవం

నంద్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నంద్యాలలో నిర్మించిన వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 15వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన ఐదు వైద్య కళాశాలలను అదే రోజు సీఎం ప్రారంభించనున్నారన్నారు. నంద్యాల మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2023-24 విద్యా సంవత్సరం తరగతులను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ప్రయోగశాలలు, హాస్టల్ వసతులు, బోధన తరగతులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

శ్రీశైలానికి 5,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా జూరాల నుంచి వరద ప్రవాహం వస్తోంది. జూరాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 5,522 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 4,113 క్యూసెక్కుల నీరు విడుదలైంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 1,750 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,458, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 10.80 మి.మీ. వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 91.6176 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యామ్ నీటిమట్టం 854.90 అడుగులకు చేరుకుంది.



ఆళ్లగడ్డ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ఆళ్లగడ్డ మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళ

యథావిధిగా వ్యాపారాలు.. రోజువారీ కార్యకలాపాలు

- కనిపించని టీడీపీ బంద్ ప్రభావం
- బాబు అరెస్టును పట్టించుకోని జిల్లా ప్రజలు, వ్యాపారులు
- తెలుగు తమ్ముళ్లు సైతం ఆందోళనలకు దూరం
- అక్కడక్కడా ఫొటో ఫోజులతో సరిపెట్టిన చోటా నేతలు
- రోడ్డెక్కిన ఆర్టీసీ బస్సులు
- యథావిధిగా కొనసాగిన ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు



డోన్ పాతబస్టాండ్ సర్కిల్‌లో సజావుగా సాగుతున్న జనజీవనం

సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రిమాండ్ నేపథ్యంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. అయితే జిల్లా కేంద్రంతో పాటు ఏడు నియోజకవర్గాల్లోనూ ఎక్కడా బంద్ ప్రభావం కన్పించలేదు. రోజులాగే యథావిధిగా జనజీవనం సాగింది. ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు బంద్‌ను ఏమాత్రం పట్టించుకోలేదు. నిర్ణీత సమయానికే వ్యాపార, వాణిజ్య సముదాయాలు తెరిచారు. చివరకు సొంత పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా బంద్ చేసేందుకు రోడ్డుపైకి రాకపోవడం గమనార్హం. ప్రతిపక్ష నేత రిమాండ్, టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. రాష్ట్ర చరిత్రలో జైలుకు వెళ్లిన తొలి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ నేపథ్యంలో బంద్‌కు స్పందన వస్తుందని టీడీపీ అధిష్టానం భావించింది. మరోవైపు జనసేన, బీజేపీ, సీపీఐలు కూడా చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీకి అనుకూలంగా ప్రకటనలు ఇచ్చారు. దీంతో ఈ పార్టీలన్నీ కలిసి వస్తాయని, బంద్ విజయవంతం అవుతుందని భావించారు. అయితే మిగిలిన పార్టీల సంగతి పక్కనపెడితే టీడీపీ కార్యకర్తలు కూడా రోడ్డెక్కలేదు. జిల్లా ప్రజలు కూడా టీడీపీ స్పందన చూసి నివ్వెరపోయారు. అక్కడక్కడా కొందరు చోటా నాయకులు రోడ్డుపైకి వచ్చి ఫొటోలకు ఫోజులు ఇచ్చి సరిపెట్టి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో లబ్ధి పొందినవారు, జన్మభూమి కమిటీల సభ్యులు, పార్టీకి చెందిన చోటా మోటా నేతలు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపైకి వచ్చి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఇది మినహా బంద్ వాతావరణమే లేకపోయింది. సీపీఐ, జనసేన, ఎమ్మార్పీఎస్ నేతలు బంద్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ వారు కూడా రోడ్డుపై కన్పించలేదు. బహుశా ప్రజలకు మేలు చేయడంలో భాగంగా బంద్‌కు పిలుపునివ్వకపోవడం, ప్రజల సొమ్మును స్వాహా చేసిన అవినీతి కేసులో జైలుకు వెళ్లడంతో ప్రజల నుంచి కూడా మద్దతు కరువైంది.

సాఫీగా ప్రజా రవాణా..
తెలుగు దేశం పార్టీ బంద్ ప్రభావం ఏమాత్రం లేకపోవడంతో జిల్లాలో ప్రజా రవాణా సాఫీగా సాగింది. ఆర్టీసీ బస్సు సర్వీసులు యథావిధిగా కొనసాగాయి. పట్టణాల్లో ఆటోలు కూడా తిరగడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించారు. నంద్యాలలో తెల్లవారుజాము నుంచి యథావిధిగా ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఒక్క బస్సు సర్వీసును కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేయలేదు. జిల్లాలోని మిగతా డిపోల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వీసులు కొనసాగించారు. కోవెలకుంట్ల, ఆత్మకూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు ఆర్టీసీ డిపోల వద్ద కూడా బంద్ ప్రభావం కన్పించలేదు.

- జిల్లా కేంద్రం నంద్యాలలో వ్యాపార సముదాయాలు, అన్ని కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. టీడీపీ నేత భూమా బ్రహ్మానందరెడ్డి, అనుచరులు ఉదయం తన అనుచరులతో కలిసి ఆర్టీసీ బస్సులను అడ్డుకునే ప్రయత్నం చేయగా డీఎస్పీ మహేశ్వరరెడ్డి తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసి టూటౌన్ స్టేషన్‌కు తరలించారు.
- డోన్ నియోజకవర్గ పరిధిలో బంద్ ఏమాత్రం కనిపించ లేదు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి, నాయకులను ముందస్తుగానే అదుపులోకి తీసుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద కనిపించ లేదు.
- శ్రీశైలం నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరులో టీడీపీ కార్యకర్తలు కాస్త హడావుడి చేసి ప్రధాన రహదారిపై టైర్లు వేసి నిప్పంటించగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాలలో బంద్ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు.
- ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో శిరివెళ్ల, చాగలమర్రి, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల్లో బంద్ ప్రభావం లేదు.



బనగానపల్లె ప్రధాన రోడ్డులో తెరిచిన వ్యాపార దుకాణాలు



నంద్యాలలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పోలీసుల పటిష్ట బందోబస్తు
చంద్రబాబు అరెస్టయిన రోజు నుంచి జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. బంద్ నేపథ్యంలో సోమవారం 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బందోబస్తును పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని వివిధ ప్రాంతాలు, జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా బంద్ ప్రభావం కనిపించకపోవడంతో వారికి కూడా పని తప్పింది. బంద్‌ను పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తెల్లవారుజాము నుంచే పోలీసులు ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లకు పోలీసులు చేరుకున్నారు. అయితే ఎక్కడ కూడా బంద్ ఛాయలే కనిపించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

టీడీపీ బంద్ హాస్యాస్పదం

- విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు(సెంట్రల్): ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లే.. దానిని నిరసిస్తూ టీడీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. టీడీపీ నాయకుల బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువైందన్నారు. ఉమ్మడి కర్నూలులో యథావిధిగా బస్సులు తిరగడంతోపాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు పనిచేశాయన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో చేయని స్కాంలులేవన్నారు. ఏలూరు భూకుంభకోణం నుంచి అమరావతి వరకు అన్ని స్కాంల్లో వేలాది కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ఇన్నాళ్లు కోర్టు స్టేలతో జైలుకు వెళ్లకుండా ఉన్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలు ఉండడంతో తప్పించుకోలేకపోయారన్నారు. టీడీపీ బంద్‌కు పవన్‌కల్యాణ్ మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఆయన టీడీపీలో ఉన్నారో లేదంటే జనసేన అధినేతనో తెలియడంలేదన్నారు. చంద్రబాబు చేసిన అన్ని కుంభకోణాల్లో విచారణ జరగాలన్నదే వైఎస్‌ఆర్‌సీపీ ప్రధాన డిమాండ్ అన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేద్దాం

- 15వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేపట్టాలి
- 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు
- రాష్ట్ర నోడల్ అధికారి రామనాథరావు



మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి రామనాథరావు

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారి రామనాథరావు, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శిక్షణ సమావేశాన్ని సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహణ సందర్భంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది చేపట్టాల్సిన సర్వే, సేకరించాల్సిన కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలపై అవగాహన కల్పించారు. ఈనెల 15 నుంచి క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఇంట్లో ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సక్రమంగా సేకరించి నమోదు చేయాలన్నారు. వారికి టోకెన్లు ఇచ్చి 30వ తేదీ నుంచి నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో వైద్యచికిత్సలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది అందుకు అనుగుణంగా గ్రామాల్లో పని చేసి ప్రజలకు అవసరమైన సేవలు అందేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్‌చంద్రారెడ్డి, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, స్థానిక వైద్యాధికారులు గోపాల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


నంద్యాల: జగనన్నకు చెబుదాం ఈకేవైసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 2,765 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన సమస్యలను వినతిదారులు సంతృప్తి చెందే స్థాయిలో గడువులోగా సత్వరమే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ కాల్వల్లో చెత్తాచెదారం తొలగింపు, పారిశుద్ధ్యం మెరుగుపర్చడం తదితర అంశాల పర్యవేక్షణ ఈఓ, ఆర్‌డీలకు అప్పగించాలని, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తీసుకోవాలని డీపీఓ మంజులవాణికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న 900 మంది పిల్లల గ్రాస్ ఎండోమెంట్ సర్వే మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అర్జీలను ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించకపోతే మళ్లీ వినతులు రీఓపెన్ అయ్యే అవకాశం ఉందన్నారు. స్పందనలో వచ్చిన 138 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ సేవా సర్వీసులకు 1,664 దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలో పెండింగ్‌లో ఉన్నాయని, రెండు రోజుల్లో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ-పంట నమోదు 67 శాతం పూర్తి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదు చురుగ్గా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 5,88,181 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 3,99,408 ఎకరాల్లో రైతన్నలు పలు పంటలు సాగు చేశారు. ఈ మొత్తానికి గాను నిన్నటి దాకా 2,67,231 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు వెల్లడించారు. దీంతో మొత్తం లక్ష్యంలో 67 శాతం పూర్తి చేశామన్నారు. ఈ నెల 15న గడువు తేదీ కావడంతో వంద శాతం లక్ష్య సాధన దిశగా సిబ్బంది పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నదాతలు దగ్గరుండి తమ పంటను వ్యవసాయ సహాయకుల దగ్గర నమోదు చేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కొడుకు, కోడలు రోజూ కొడుతున్నారు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన వృద్ధురాలు



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణం టెక్కె వీధిలో నివాసముంటున్న తన కుమారుడు శ్రీనివాసులు, కోడలు నాగేశ్వరమ్మ ప్రతి రోజు తనపై దాడి చేయడంతో పాటు మానసికంగా హింసిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని వృద్ధురాలు మల్లమ్మ ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది ఎస్పీకి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కుమార్తె పుట్టిందని భర్త, అత్తింటి వారు వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పాణ్యం మండలం కొండజూటూరుకు చెందిన పుష్పాల శ్రీవాణి ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఇలా పలువురు కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, భూ ఆక్రమణలు తదితర విషయాలపై న్యాయం చేయాలని ఫిర్యాదులు అందజేశారు. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఫిర్యాదుల కోసం నేరుగా తమ నంబర్ 9154987020కు ఫోన్ చేయాలని కోరారు. వాట్సాప్ ద్వారా ఈ నెంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్బీ డీఎస్పీ సంతోష్, సీఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ పరుగు పోటీల్లో 409 మంది ఎంపిక



పరుగులో పోటీ పడుతున్న ఎస్‌ఐ అభ్యర్థులు

కర్నూలు: రాయలసీమ జోన్ ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీ ఎస్పీ రెండో పటాలం మైదానంలో 12వ రోజు దేహదారుడ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు. సోమవారం జరిగిన దేహదారుడ్య పరీక్షలకు 800 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 579 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తరువాత బయోమెట్రిక్ ఎత్తు, ఛాతీ కొలతలు పరీక్షించారు. అనంతరం శారీర సామర్థ్య పరీక్షలు 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 409 మంది అభ్యర్థులు ప్రతిభ కనబరిచి తుది రాత పరీక్షకు (మెయిన్స్) అర్హత సాధించారు. ఈవెంట్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు అందరూ ఒరిజినల్ మార్క్స్ మెమోతో పాటు మూడు సెట్లు గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు రెండు రోజులే గడువు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరుకు సంబంధించి బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్. సబీహా పర్వీన్ సోమవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 927 విద్యా సంస్థల్లో ఇప్పటి వరకు 599 విద్యాసంస్థలు మాత్రమే అథెంటికేషన్ పూర్తి చేసుకున్నాయన్నారు. అథెంటికేషన్ పూర్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 12, 13వ తేదీల వరకు అవకాశం ఇచ్చిందన్నారు. అలాగే 2022-23 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులకు (9వ తరగతి నుంచి) బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించాలన్నారు. ఆ తర్వాత విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తులను విద్యాసంస్థల లాగిన్‌లో పరిశీలించి జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపించాలన్నారు. మరింత సమాచారానికి హనుమంతరావు(9059446377), వేణుగోపాల్(8885488088)లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి



తూకాలను తనిఖీ చేస్తున్న సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం ఉల్లి పోటెత్తింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో మొదటి సారి మార్కెట్‌కు 5,336 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ఈ సారి వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఉల్లి ఆలస్యంగా సాగయింది. అందువల్ల మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే వస్తోంది. 116 మంది రైతులు 11,857 బ్యాగుల ఉల్లి తెచ్చారు. ఇది 5,336 క్వింటాళ్ల అవుతుంది. సరుకును వ్యాపారులు ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేశారు. మార్కెట్‌కు ఊహించని విధంగా ఉల్లి పోటెత్తుడంతో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, అసిస్టెంటు సెక్రటరీ వెంకటేశ్వర్లు మార్కెట్‌లో పర్యటించి రైతుల ఇబ్బందులను పరిశీలించారు. రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని తూకాలను తనిఖీ చేశారు. ఉల్లికి కనిష్ట ధర రూ.661, గరిష్ట ధర రూ.2369, మోడల్ ధర రూ.1,728 లభించింది. 371 క్వింటాళ్ల వేరుశనగ, 31 క్వింటాళ్ల ప్రొద్దుతిరుగుడు, 229 క్వింటాళ్ల ఆముదం కూడా మార్కెట్‌కు వచ్చింది.

24న కురువ వివాహ పరిచయ వేదిక



కరపత్రాలు విడుదల చేస్తున్న కురువ నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కురువ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘం నేతలు తెలిపారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో వేదికకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సంఘం గౌరవాధ్యక్షులు కె.కిష్టన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కురువ సామాజిక వర్గానికి చెందిన తల్లిదండ్రులు, అవివాహితులైన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బొప్పాయి మొక్కల నరికివేత



పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమణయ్య

చాగలమర్రి: చిన్నవంగలి గ్రామంలో ఓ రైతుకు చెందిన 1,200 బొప్పాయి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. గ్రామానికి చెందిన రైతు వెంకట ప్రసాద్ రెడ్డి తన 2.50 ఎకరాల పొలంలో సాగు చేసిన పసుపు పంటలో రెండు నెలల క్రితం అంతర పంటగా 1,200 బొప్పాయి మొక్కలు నాటి పెంచుతున్నాడు. కాగా సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతుకు నరికివేసిన బొప్పాయి మొక్కలు కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ రమణయ్య సిబ్బందితో పొలాన్ని పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

కన్నీళ్లు తుడుస్తూ.. కష్టాలు తొలగిస్తూ!

- పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ బీమా పథకం
- సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ.5 లక్షల పరిహారం
- దళారుల ప్రమేయం లేకుండా డీబీటీ ద్వారా నామినీ ఖాతాకు నగదు జమ
- జిల్లాలో 5,69,866 కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయం



కర్నూలు(అగ్రికల్చర్): ఊహించని విపత్తులు.. అనుకోకుండా జరిగిన ప్రమాదాలు పేద కుటుంబాలను శోకసంద్రంలోకి నెడుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మరణంతో ఆయా కుటుంబాల్లో నైరాశ్యం నెలకొంటోంది. అప్పటి వరకు సాఫీగా సాగిన జీవితం తల్లకిందులవుతోంది. ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువులు సైతం ఆగిపోతున్నాయి. పేదల కష్టాలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తూ వారి కన్నీరు తుడుస్తోంది. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత అందిస్తూ ధీమా నింపుతోంది.

ఏపీజీఐసీని ఏర్పాటు

రైస్ కార్డు కలిగిన వారికి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా సదుపాయం కల్పిస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా మరణించిన వారి కుటుంబాల నామినీలకు డీబీటీ ద్వారా పరిహారం చెల్లిస్తోంది. కర్నూలు జిల్లాలో 6,62,654 రైస్‌కార్డులు ఉండగా, 5,69,866 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం అమలవుతోంది. కుటుంబానికి ఆధారమైన 18–50 ఏళ్లలోపు పాలసీదారులు సాధారణంగా మరణిస్తే రూ. లక్ష పరిహారం లభిస్తుంది. అలాగే 18–70 ఏళ్ల లోపు పాలసీదారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం అందజేస్తున్నారు. గతేడాది వరకు ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఎల్ఐసీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తదితర వాటితో ఒప్పందం చేసుకుంది. అయితే మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో విపరీతమైన జాప్యం జరుగుతుండటంతో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ(ఏపీజీఐసీ)ని ఏర్పాటు చేసింది. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

నెల రోజుల్లోపే పరిహారం

గతంలో ప్రమాద మరణాలకు పరిహారం లభించాలంటే ఏడాదిపైగా సమయం పట్టేది. ప్రభుత్వం నిబంధనలు సరళతరం చేసింది. ప్రమాదమరణాలకు ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికెట్, పోస్టుమార్టం రిపోర్టు ఉంటే చాలు పరిహారం నెలలోపే డైరెక్ట్ బెనిఫిట్ ద్వారా మరణించిన వారి నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతోంది. బీమా సంవత్సరం జూలై 1 నుంచి జూన్ 31 వరకు ఉంటుంది. 2023–24లో అంటే జూలై 1 నుంచి ఇప్పటి వరకు 282 మంది వైఎస్ఆర్ బీమా పాలసీదారులు మరణించారు. ఈ కుటుంబాలకు రూ. లక్ష ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సమాచారం అందిన వెంటనే మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు చెల్లించారు. పాలసీదారులు మరణించినపుడు వెంటనే 24 గంటల్లో డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలోని కాల్ సెంటరు నంబరు 08518–289222కు, గ్రామ, వార్డు సచివాలయానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. అపుడు సచివాలయం ద్వారా మట్టి ఖర్చులకు రూ.10వేలు సహాయం అందచేస్తారు. 2022 జూలై 31 నుంచి 2023 జూన్ 31 వరకు 1,431 మంది పాలసీదారులు సాధారణంగా మరణించారు. వంద శాతం కుటుంబాలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నామినీల బ్యాంకు ఖాతాలకు రూ.14.31 కోట్లు చెల్లించడం విశేషం. 179 మంది ప్రమాదవశాత్తు మరణించగా.. 119 కుటుంబాలకు రూ.5 లక్షల ప్రకారం పరిహారం చెల్లించారు. మిగిలిన కుటుంబాలకు పరిహారం చెల్లించే ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది.

నెల రోజులకే రూ.5లక్షల పరిహారం వచ్చింది

మాది నిరుపేద కుటుంబం. నా భర్త సుంకన్న ఒక్కరే మా కుటుంబానికి ఆధారం. 2023–24 సంవత్సరంలో నా భర్త సుంకన్నకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైఎస్ఆర్ బీమా పాలసీ లభించింది. అయితే దురదృష్టవశాత్తు నా భర్త ఆగస్టు 1న ప్రమాదశాత్తూ అంటే విద్యుత్‌షాక్‌కు గురై మరణించారు. ఈ విషయం వెంటనే గ్రామ సచివాలయానికి సమాచారం ఇచ్చాం. వెంటనే మట్టి ఖర్చులకు రూ.10 వేలు చెల్లించాలి. వారంలోపు అన్ని డాక్యుమెంట్లు సమర్పించాం. సెప్టెంబరు1న నా బ్యాంకు ఖాతాకు రూ.4.90 లక్షలు జమ అయింది. నెల రోజుల్లోనే రూ.5 లక్షల పరిహారం లభించడం ఎంతో ఊరటనిచ్చింది.

– ఎం.నరసమ్మ, పుటుకలమర్రి, ఆస్పరి మండలం

బాధిత కుటుంబాలకు సత్వర ఉపశమనం



ప్రమాద మరణాలకు సత్వరం పరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏపీజీఐసీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తీసుకున్న చొరవతో బాధిత కుటుంబాలకు సత్వరం ఉపశమనం లభిస్తోంది. ఇప్పటి వరకు వైఎస్ఆర్ బీమా పొందిన వారిలో 15 మంది ప్రమాదశాత్తు మరణించగా.. ఇందులో తొమ్మిది కుటుంబాలకు నెలలోపే రూ.5 లక్షల ప్రకారం డీబీటీ ద్వారా నామినీల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది. – నాగశివలీల, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎన్‌జీఓ కాలనీ, లలితా నగర్, నంద్యాల

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 99122 20581

సంగమేశ్వరంలో విశేష పూజలు

కొత్తపల్లి: సప్తనదుల సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్‌లోని ఉమామహేశ్వరాలయంలో నిజ శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ చేపట్టారు. 40 రోజుల దీక్షాకాలంలో వరుణ సంకల్పంలో భాగంగా వరుణ జపములు అక్టోబర్ 14 వరకు కొనసాగుతాయన్నారు. ఈ పూజల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో కృష్ణా జలాల్లో ఉన్న సంగమేశ్వర ఆలయ గోపురాల వరకు నీరు చేరుకుంది.

మనీ సర్క్యులేషన్ స్కీం పేరుతో మోసం



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సర్కార్

కర్నూలు: మనీ సర్క్యులేషన్ స్కీం పేరుతో కర్నూలు బాపూజీనగర్‌కు చెందిన కళ్యాణ్, ధీరజ్ అనే వ్యక్తులు రూ.9.50 లక్షలను తీసుకొని మోసం చేశారని అడిషనల్ ఎస్పీ టీ సర్కార్‌కు కర్నూలు బంగారుపేటకు చెందిన కరుణాకర్ ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 67 ఫిర్యాదులు వచ్చాయి. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు.

ఫిర్యాదుల్లో కొన్ని ...

- తన బ్యాంకు ఖాతా నుంచి రూ.4.77 లక్షలను సైబర్ నేరగాళ్లు దొంగిలించారని ఆదోనికి చెందిన మహబూబ్‌బాషా ఫిర్యాదు చేశారు.
- ఆస్తి రాసివ్వాలని కొడుకు, కోడలు పొలంలో విత్తనం వేయనీయకుండా ఇబ్బందులను గురిచేస్తున్నారని సీ బెళగల్ మండలం కంపాడు గ్రామానికి చెందిన యశోదమ్మ ఫిర్యాదు చేశారు.
- ఎలాంటి ఆధారాలు లేకుండా కొందరు తమ పొలంలోకి వచ్చి అడ్డుపడుతున్నారని ఆలూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రవికుమార్ ఫిర్యాదు చేశారు.
- అనారోగ్యంతో మంచం పట్టిన తండ్రి బాగోగులు చూస్తే ఆస్తిలో భాగం ఇస్తామని చెప్పి, ఆయన మృతి చెందిన అనంతరం తమ్ముడు మోసం చేస్తున్నాడని కర్నూలు ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన సరోజ ఫిర్యాదు చేశారు.

ఇక మండల కేంద్రాల్లోనూ 'స్పందన'

- ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహణ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో రోజు ఒక్క మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే స్పందనకు ఇవి అదనమని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రంలో జరిగే స్పందనకు అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆయా మండలాల్లో నిర్వహించే కార్యక్రమ వివరాలను వారం రోజుల ముందే తెలిపి అవగాహన కల్పించాలన్నారు.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి. సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, ప్రజావిశ్వాసాన్ని కోల్పోయి ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లారని వైఎస్సార్‌సీపీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ పి. రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో చేనేతల కార్మికుల స్థితిగతులు తెలుసుకున్న అనంతరం స్థానిక హాల్‌లో పార్టీ కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర సంస్థలు దర్యాప్తు చేసి ఇచ్చిన నివేదికలతో సీఐడీ పోలీసులు పక్కా ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఈ విషయంలో వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వైఎస్సార్‌సీపీ అమలు చేసిందని, వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక నేరాలకు పాల్పడి ప్రజల సొమ్మును పక్కదారి పట్టించి జైలుకెళ్లిన చంద్రబాబునాయుడిని ప్రజలు ఇక నమ్మబోరన్నారు. పక్కా ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు ఇక జైలు జీవితం గడపాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మైనారిటీ కాలనీ రోడ్ల నిర్మాణాలు, గంజిహళ్లి హంద్రీ మీదుగా తెర్నేకల్‌కు బ్రిడ్జి, టిడ్కో గృహాలకు బైపాస్ రోడ్డు లాంటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని రామసుబ్బారెడ్డిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కుర్ణికరికాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బుట్టా శారదమ్మ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యశ్రీ, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్ అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్ అహమ్మద్, పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర,అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, ఎంపీపీ కేశన్న తదితరులు పాల్గొన్నారు.

'సుంకేసుల'కు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు సోమవారం 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి స్థాయిలో 1.20 టీఎంసీలు నీరు నిల్వ ఉంచి మిగతా నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఈరన్న పల్లకోత్సవం.. ఊరూరా భక్తిపారవశ్యం



పల్లకోత్సవంలో పాల్గొన్న భక్తులు

కౌతాళం/కోసిగి: శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి విగ్రహాన్ని పల్లకిలో కొలువుంచారు. ఉరుకుంద నుంచి కోసిగి మండలం కందుకూరు గ్రామ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న తుంగభద్ర నది వరకు ఉత్సవం నిర్వహించారు. నదిలో నీళ్ల లోతట్టు గుంతలు ఉండడంతో ఈ ఏడాది క్రేన్ సహకారంతో స్వామికి పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం నది ఒడ్డున దింపుడు కట్టపై స్వామి వారిని కొలువుంచి అభిషేకాలు చేసి, మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం యథావిధిగా పల్లకీలో ఊరేగింపుగా స్వామి బయలు దేరారు. కందుకూరు, కామన్‌దొడ్డి, తిప్పలదొడ్డి, కరణి గ్రామాల మీదుగా ఉరుకుంద క్షేత్రానికి చేరుకున్నారు. పల్లకోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతర జరిగింది. నది ఒడ్డున చేరుకుని స్వామి వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నాగరాజు గౌడ్, ఆలయ ఈఓ వాణి, ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వైఎస్సార్ మండల కన్వీనర్ బెట్టన గౌడ, జెడ్పీటీసీ సభ్యులు పవిత్ర పాటిల్, ఎంపీపీ ఈరన్న, ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ ఏరిషా వలి, కౌతాళం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



తుంగభద్ర నదిలో స్వామికి పుణ్యస్నానం



ఉత్సవమూర్తిని ఒడ్డుకు తీసుకొస్తున్న దృశ్యం

చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించండి




చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల: జిల్లాలో చిరుధాన్యాల సాగుపై రైతులకు ఆసక్తి కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ సెంటినరీ హాల్ ఆవరణలో డీఆర్‌డీఏ, రైతు సాధికారత సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల విక్రయ ఉత్పత్తులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లెట్ సంవత్సరం సందర్భంగా జిల్లాలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణ స్థాయి పెంచేందుకు కృషి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా చిరుధాన్యాలను సాగు చేయవచ్చునని, ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షణలో చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు కొత్త శనగ వంగడాలు విడుదల

- ఆర్ఏఆర్ఎస్ సహసంచాలకులు వెంకటేశ్వర్లు



ఎన్‌బీఈజీ-924 రకం మొక్కకు విరగకాసిన శనగ కాయలు



ఎన్‌బీఈజీ-1267 రకం విత్తనాలు

నంద్యాల(సెంట్రల్): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) నుంచి అధిక దిగుబడిని ఇచ్చే రెండు కొత్త శనగ వంగడాలను విడుదల చేస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ సహ సంచాలకులు ఎస్‌.వెంకటేశ్వర్లు తెలిపారు. నంద్యాల రకాలైన ఎన్‌బీఈజీ–1267 రకం 90–95 రోజుల పంట కాలంతో హెక్టారుకు 21 క్వింటాళ్ల దిగుబడి, ఎన్‌బీఈజీ–924 రకాలు 105–115 రోజుల కాల వ్యవధితో 17.22 క్వింటాళ్ల అత్యధిక దిగుబడినిచ్చినట్లు తేలిందన్నారు. ఇతర రకాలైన జేబీఎం2, ఎన్‌బీఈజీ 47, జేజీ 11, జేఏకేఐ 9218తో పోలిస్తే రమారమి 5 క్వింటాళ్ల దాకా అధిక దిగుబడినిస్తున్నాయన్నారు. త్వరలో ధర నిర్ణయించి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని రాహురిలో జరిగిన అఖిల భారత రబీ పప్పు ధాన్యాల సమావేశంలో ఈ కొత్త వంగడాల ఆవిష్కరణపై ఆర్ఏఆర్ఎస్‌కు ఉత్తమ పరిశోధనా స్థానం పురస్కారం దక్కినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగమైన ప్రధాన శాస్త్రవేత్తలు వీర జయలక్ష్మి, మంజునాథ్, చైతన్య, రమాదేవిని ఆయన అభినందించారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ అమర వీరుల సేవలు చిరస్మరణీయమని ఆ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఏ.రామకృష్ణ కొనియాడారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. చీఫ్ కన్జర్వేటర్‌తో పాటు డీఎఫ్‌వో పి.శివశంకర్‌రెడ్డి, రేంజర్లు, అటవీ శాఖ ఉద్యోగులు అమర వీరు స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 23 మంది అటవీ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారి సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సోషల్‌ఫారెస్ట్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, కర్నూలు ఎఫ్ఆర్‌వో సూర్యచంద్రరాజు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో సుదర్శన్, మేనేజర్ అబ్దుల్ సుభాన్, సూపరింటెండెంట్ రామచంద్రరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.